అందని మందులు



జోగుళాంబ గద్వాల జిల్లాలో మందులు పంపిణీ చేస్తున్న 104 సిబ్బంది(ఫైల్)

- 104 వాహన సేవల రద్దుతో ఇబ్బందులు పడుతున్న గ్రామీణులు
- వాటికి ప్రత్యామ్నాయంగా తెచ్చిన ఎన్‌సీడీ కిట్ల పంపిణీ అంతంతే..
- ఉమ్మడి పాలమూరు జిల్లాలో సంచార వాహనాలు మూలకు..
- పెరుగుతున్న అసంక్రమిత వ్యాధుల తీవ్రతపై సరైన దృష్టి అవసరం
- 104 సేవలను తిరిగి వినియోగంలోకి తేవాలంటున్న ప్రజలు

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పేద ప్రజలకు సమీపంలో వైద్య సేవలు అందడం.. ఏదైనా ప్రమాదం జరిగితే సమీప వైద్య వసతికి తొందరగా తీసుకెళ్లడం కోసం 104, 108 వాహనాలను గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రారంభించింది. అందులో 108 అంబులెన్స్ సేవలు ఇప్పటికీ నడుస్తుండగా, 104 వైద్య సేవలను గత ప్రభుత్వం 2021లో నిలిపేసింది. దాని స్థానంలో అసంక్రమిత వ్యాధులపై సర్వే చేసి.. ఎన్‌సీడీ(నాన్ కమ్యూనబుల్ డిసీసెస్) కిట్లను పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ కిట్లను పీహెచ్‌సీలకు వచ్చి తీసుకువెళ్లడం లేదా ఏఎన్‌ఎంల ద్వారా పంపిణీ చేయాలని సంకల్పించింది. ఈ విధానం ద్వారా ప్రస్తుతం వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు తదితరులకు మందులు సరైన క్రమంలో అందడం లేదు. పీహెచ్‌సీలకు వెళ్లి తీసుకెళ్లడం ఇబ్బందిగా మారడంతో ప్రైవేటు మందులపై ఆధారపడుతున్నారు. కొన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేసిన రూపొందించిన వాహనాలు మూలకు పడగా, అందులో పనిచేసే సిబ్బందిని సర్దుబాటు పేరుతో ఎక్కడపడితే అక్కడ వేశారు. వారికి వేతనాల విషయంలో కూడా ఒక వ్యవస్థ అంటూ లేకుండా పోయింది. 104 వాహనాల డ్రైవర్లను గిఫ్ట్ ఏ స్మైల్ కింద వచ్చిన అంబులెన్స్‌లకు వినియోగించు కుంటామని చెప్పింది. సదరు అంబులెన్స్‌లకు ఇంకా ప్రొవిజన్ కూడా రాకపోవడం గమనార్హం. ప్రస్తుతం కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి రావడంతో ఆ పార్టీ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల్లో 104 ఒకటి కాబట్టి, దాన్ని తిరిగి ప్రారంభించాలనే డిమాండ్ రోజురోజుకూ బలపడుతోంది. ఎన్‌సీడీ కిట్లు ఇంటింటికీ తిరిగి ఏఎన్‌ఎంలతో ఇప్పిస్తున్నామని చెబుతున్నప్పటికీ.. వారికి ఇతర పని ఒత్తిడి కారణంగా పేదలకు ఇబ్బందులు తప్పడం లేదు.

పేదల సంజీవని..

కాంగ్రెస్ ప్రభుత్వం 2008లో అధికారంలోకి ఉన్నప్పుడు వైద్య ఆరోగ్యశాఖలో 104, 108 విధాన నిర్ణయాలతోపాటు ఆరోగ్యశ్రీని విప్లవాత్మకంగా తెచ్చింది. ఆ పార్టీ అధికారంలో ఉన్న పదేళ్లు.. తర్వాత బీఆర్ఎస్ అధికారంలో ఉన్న ఏడేళ్ల పాటు 104 ద్వారా సేవలు అందించారు. ఒక్కో వాహనం నెలకు కేలండర్ ప్రకారం పీహెచ్‌సీ పరిధిలోని 60 గ్రామాల వరకు కవర్ చేయాల్సి ఉండేది. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులకు ఫిక్స్‌డ్ హెల్త్ సర్వీసెస్ సేవలు అందించేవారు. బీపీ, షుగర్, ఆస్తమా, ఫిట్స్, జ్వరం, దగ్గు, జలుబుకు సంబంధించిన మందులతోపాటు గర్భిణులకు ఫోలిక్ యాసిడ్, ఐరన్ మాత్రలన పంపిణీ చేసేవారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి.. హెచ్చు తగ్గులను బేరీజు వేసి మందులు ఇచ్చేవారు. అయితే నాన్ కమ్యూనబుల్ డిసీసెస్ సర్వే చేపట్టిన తర్వాత ఆయా జిల్లాల్లో ఎంత మంది బీపీ, షుగర్, క్యాన్సర్ రోగులు ఉన్నారో గుర్తించారు. అందుకు ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీని పరిగణలోకి తీసుకున్నారు. గుర్తింపు వరకు బాగానే ఉన్నప్పటికీ.. తర్వాత కిట్ల పేరుతో 104 సేవలకు మంగళం పాడారు. దీంతో వృద్ధులు పీహెచ్‌సీలకు వెళ్లి కిట్లను తీసుకోలేక వాడటం మానేస్తున్నారు. మందులు వాడకపోవడంతో గుండెపోటు, పక్షవాతం వంటి వాటికి దారితీస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అవసరం మేరకు ఎన్‌సీడీ కిట్లను తీసుకోకపోవడంతో స్టాక్ కావాల్సినంత ఉందని చెప్పుకోవడానికి మాత్రమే పనికి వస్తోంది. కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రుల ఒత్తిడితోనే ఈ సంచార వైద్యశాలల విధానాన్ని పక్కన పెట్టారని అప్పట్లో విమర్శలు వచ్చాయి. దీనిని గతంలో ప్రారంభించిన ప్రభుత్వమే పునఃప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

మందులు లేక ఇబ్బందులు



నాకు చాలా ఏళ్లుగా బీపీ, షుగర్ ఉంది. గతంలో 104 వాహనం ప్రతీనెలా ఊరికి వచ్చి పొద్దున నుంచి సాయంత్రం వరకు బీపీ, షుగర్ చూసి.. మందులు ఇచ్చి వెళ్లేవారు. రెండేళ్ల నుంచి ఆ వాహనాలు ఊర్లకు రావడం లేదు. మా ఊరు నుంచి సరైన బస్సు సౌకర్యం లేదు. పీహెచ్‌సీలకు వెళ్లి.. మందులు తెచ్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నాం. ఊర్లకు వచ్చి మందులు ఇస్తే బాగుంటుంది.

- కేశన్న, రేపల్లి, గద్వాల జిల్లా

సర్దుబాటు గందరగోళం..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో దాదాపు 104 సంచార వైద్య సేవల వాహనాలు దాదాపు 32 వరకు ఉండేవి. అందులో సుమారుగా 200 మంది సిబ్బంది పని చేసేవారు. 104ను 2021లో రద్దు చేసిన తర్వాత వారందరినీ విధుల్లో నుంచి టర్మినేట్ చేయాలని భావించారు. 104 సిబ్బంది ఒత్తిడి తేవడంతో వారిని తెలంగాణ డయాగ్నొస్టిక్స్, కరోనా సేవలు, డీఎంహెచ్‌వో ఆఫీసు డ్రైవర్లుగా నియమించుకున్నారు. కానీ వారు ఏ పే స్కేల్ కింద, ఎవరి ఆధ్వర్యంలో ఏం పని చేస్తున్నారు?, ఎంత జీతం ఇస్తున్నారు?, ఎక్కడి నుంచి సర్దుబాటు చేస్తున్నారో తెలియక సిబ్బంది అభద్రతాభావంలో ఉన్నారు. దాదాపు 32 వాహనాలు మూలకు పడేయడంతో అవి తుప్పుపట్టి, కోట్ల రూపాయల ప్రజా ధనం వృథా అయ్యింది. వాటిని వేలం వేయాలని పలుపురు అధికారులకు వైద్యరోగ్యశాఖ నుంచి ఆదేశాలు వచ్చాయని చెబుతున్నప్పటికీ.. ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు కూడా తీసుకోవడం లేదు. అటు వృద్ధులు, రోగులకు మందులు అందకపోవడంతో గొప్ప లక్ష్యం నీరుగారిపోతుండగా, ఇటు ఉద్యోగ భద్రత లేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ అవకాశం ప్రైవేటు ఆస్పత్రులు, మెడికల్ దుకాణాలకు వరంగా మారిందని చెప్పొచ్చు. గతంలో ఉచితంగా అందించే మందులను ఇప్పుడు భారీగా ఖర్చు పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తుండటంతో వృద్ధుల పింఛన్ డబ్బులు మందులకే సరిపోతున్నాయి.

జిల్లాల వారీగా బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తుల వివరాలు

జిల్లా	బీపీ	షుగర్
మహబూబ్‌నగర్	80,443	46,351
జోగుళాంబ గద్వాల	48,333	22,942
వనపర్తి	39,134	20,204
నారాయణపేట	51,014	26,362
నాగర్‌కర్నూల్	69,328	34,379
మొత్తం	2,88,252	1,50,238



మహబూబ్‌నగర్ జిల్లాలో తుప్పు పట్టిపోతున్న 104 వాహనాలు

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు



జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

- వారి నుంచి రూ.4.50 లక్షలు స్వాధీనం
- సోలార్ ప్లాంట్లలో వైరు దొంగిలించి, అందులోని కాపర్ విక్రయం
- వివరాలు వెల్లడించిన మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు

జడ్చర్ల, సెప్టెంబరు 20: సోలార్ ప్లాంట్లలో తీగలను దొంగిలించి, అందులోని కాపర్‌ను విక్రయించే అంతరాష్ట్ర దొంగలను పట్టుకున్నట్లు మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. జడ్చర్ల రూరల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం డోన్ మండలం ద్రోణాచాలం, నల్గొండ జిల్లాకు చెందిన 11 మంది సభ్యులు ముఠాగా ఏర్పడ్డారని తెలిపారు. వారు మిడ్జిల్ మండలం బోయిన్‌పల్లి సమీపంలోని సోలార్ ప్లాంటులో కేబుల్ దొంగలించి, దానిని కరుగబెట్టిన అనంతరం వచ్చిన కాపర్(రాగి)ను విక్రయించారని చెప్పారు. ముఠాలోని ముగ్గురు వ్యక్తులు ఆటోలో మిడ్జిల్ నుంచి జడ్చర్లకు వస్తుండగా మున్ననూరు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్, మిడ్జిల్ ఎస్ఐ శివకేశవనాయుడులకు అనుమానాస్పదంగా కనిపించారని చెప్పారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ చేపట్టగా, కేబుల్ వైర్లను దొంగతనం చేసి, అందులోంచి కాపర్ తీసి విక్రయిస్తామని వారు తెలిపారన్నారు. చోరీలకు పాల్పడే సందర్భంలో ఉపయోగిస్తున్న ఆటో సరిపోవడం లేదని, పెద్ద ఆటోను కొనుగోలు చేయడానికి వెళ్తుండగా పట్టుబడ్డారని తెలిపారు. పట్టుబడ్డ వారిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం డోన్ మండలం ద్రోణాచలానికి చెందిన వజ్రగిరి సత్యరాజ్, వజ్రగిరి మధు, పెబ్బేరుకు చెందిన మునుగురాయి రామకృష్ణ ఉన్నారన్నారు. వారి వద్ద ఉన్న రూ.4.50 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. వీరు సోలార్ ప్లాంట్ల వద్ద ఉదయం వేళల్లో గస్తీ నిర్వహించి, రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడుతారన్నారు. అందులో భాగంగానే బోయిన్‌పల్లి సమీపంలోని సోలార్ ప్లాంటులో చోరీకి వచ్చిన 11 మంది ముఠా సభ్యులలో వజ్రగిరి బాలస్వామి, జయరాజు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారన్నారు. 11 మందిలో ఇద్దరు మృతి చెందగా, ముగ్గురిని అరెస్ట్ చేశామని, మరో ఆరుగురు నల్గొండ జిల్లాకు చెందిన ఎరుకలి సుంకన్న, జంగన్న, డోన్‌కు చెందిన ఏడుకొండలు, ఎరుకలి మద్దిలేటి, ఎరుకలి నవీన్, నాగమణి పరారీలో ఉన్నారన్నారు. వీరిపై ఇప్పటికే మిడ్జిల్ మండలం బోయిన్‌పల్లిలో ఒకటి, రాణిపేటలో రెండు, చిన్నచింతకుంటలో రెండు, అడ్డాకుల, ఆమన్‌గల్, మక్తల్, మానవపాడు ఒకటి చొప్పున చోరీ కేసులు నమోదు అయ్యాయని వివరించారు. ముఠాలోని ఎరుకలి సుంకన్న, మృతి చెందిన బాలస్వామి ప్రధాన నిందితులని చెప్పారు. స్వాధీనం చేసుకున్న డబ్బుల్లో మిడ్జిల్ పోలీస్ స్టేషన్‌లో నమోదయిన మూడు కేసులకు సంబంధించిన రూ.2.50 లక్షలు, అడ్డాకుల, చిన్నచింతకుంట పోలీస్‌స్టేషన్‌లో నమోదయిన కేసులకు సంబంధించి రూ.1.90 లక్షలు, ఆమన్‌గల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి రూ.10 వేలు ఉన్నాయని వివరించారు. సమావేశంలో జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్, మిడ్జిల్ ఎస్ఐ శివకేశవనాయుడు, కానిస్టేబుల్స్ వెంకటేశ్, బాలు, నానులు ఉన్నారు.



స్వాధీనం చేసుకున్న నగదు



తనగలలో మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణ ప్లాన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, నాయకులు

రైతులను ఆదుకుంటాం

- కలెక్టర్ బీఎం సంతోష్
- మల్లమ్మకుంట రిజర్వాయర్ స్థలం పరిశీలన

వడ్డేపల్లి, సెప్టెంబరు 20: జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయే రైతులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని కలెక్టర్ బీఎం సంతోష్ తెలిపారు. రైతుల వివరాలను సమగ్రంగా అధ్యయనం చేసి, ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. తద్వారా పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని తనగల గ్రామంలో నిర్మించనున్న మల్లమ్మకుంట రిజర్వాయర్ ప్రదేశాన్ని అదనపు కలెక్టర్ శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. రిజర్వాయర్ నిర్మాణం కోసం అవసరమైన స్థలానికి ప్రభుత్వ భూమి, పట్టా భూమి ఎంత ఉందన్న వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిజర్వాయర్ మ్యాప్‌ను పరిశీలించారు. నీటి పంపిణీ మార్గాలు, ప్రత్యేకంగా తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ద్వారా పంపింగ్ స్టేషన్ల స్థానం, వాటి సామర్థ్యం, రిజర్వాయర్‌కు నీటి ప్రవాహం, సహజ అవరోధాలు, బండ్ నిర్మాణంతో పాటు నీటి సామర్థ్యం వంటి కీలక అంశాలను అధికారులతో చర్చించారు. రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా పలు అంశాలను సమీక్షించిన కలెక్టర్ అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. రిజర్వాయర్ నిర్మాణం వేగంగా, సమర్థవంతంగా పూర్తయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోయినందుకు భూమికి బదులుగా భూమి ఇవ్వాలని రైతులు కోరగా, సరైన పరిహారం అందించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కలెక్టర్ వెంట నీటి పారుదల శాఖ ఈఈ విజయ్‌కుమార్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ జోషి, అసిస్టెంట్ ఇంజనీర్లు ఉన్నారు.

తండ్రిని నరికిచంపిన తనయుడు



నారాయణ (ఫైల్)

రాజాపూర్, సెప్టెంబరు 20 : మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం రాయపల్లి గ్రామంలో కన్న తండ్రిని, కుమారుడు గొడ్డలితో నరికి చంపిన సంఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకున్నది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కావలి నారాయణ (56)కు ఓ కుమారుడు, కూతురు ఉన్నారు. వారికి వివాహాలు అయ్యాయి. కుమారుడు ఆనంద్ పదవ తరగతి వరకు చదివి పని చేయకుండా గ్రామంలో తిరుగుతుండేవాడు. ఏదైనా పని చేసుకొని బతకాలని తల్లిదండ్రులు రోజూ చెప్పేవారు. దీంతో ఇంట్లో గొడవలు జరిగేవి. డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తానని తల్లిదండ్రులను బెదిరించేవాడు. గురువారం రాత్రి అందరూ పడుకున్న తర్వాత ఆనంద్ తన తండ్రి కావలి నారాయణను గొడ్డలితో నరకడంతో రక్తపు గాయాలయ్యాయి. దీంతో ఆయనను కుటుంబీకులు చికిత్స నిమిత్తం ఆటోలో ఆసుపత్రికి తరలించగా మార్గం మధ్యలోనే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. గ్రామస్థుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుడు పరారీలో ఉన్నాడని ఎస్సై రవి చెప్పారు. మృతుడి భార్య కావలి చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బైక్‌పై నుంచి పడి మహిళ దుర్మరణం

- తలపై నుంచి దూసుకెళ్లిన లారీ
- బాలానగర్ వద్ద ఘటన

బాలానగర్, సెప్టెంబరు 20: ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి ఓ మహిళ రోడ్డుపై పడగా, తలపై నుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ ఎస్ఐ తిరుపాజి కథనం మేరకు.. రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలంలోని వెనిజర్ల చెందిన రెహానబేగం(45) తన కుమారుడితో కలిసి షాద్‌నగర్ నుంచి జడ్చర్ల వైపు బైక్‌పై వెళ్తున్నారు. బాలానగర్ చౌరస్తా వద్దకు రాగానే స్పాపర్లు మహిళ కాలికి తగలడంతో బైక్ అదుపు తప్పి తల్లి రోడ్డు మధ్యలో పడగా, కుమారుడు రోడ్డు పక్కకు పడ్డాడు. వెనుక నుంచి వచ్చిన లారీ మహిళ తలపై మీదుగా వెళ్లడంతో ప్రాణాలు విడిచింది. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

మూసాపేట, సెప్టెంబరు 20: మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలంలోని తుంకినిపూర్ శివారులోని గుండ్రాయి బావిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. గ్రామస్థుల తెలిపిన వివరాల ప్రకారం.. తుంకినిపూర్ చెందిన ఇండ్ల సందుల వన్నం లక్ష్మయ్య(58) కొంతకాలంగా మతి స్థిమితం లేకుండా సంచరించేవాడని, కూలీ పనులు చేస్తుండేవాడని గ్రామస్థులు తెలిపారు. ఈ క్రమంలోనే వేముల రోడ్డుకు వెళ్లే మార్గంలో ఉన్న గుండ్రాయిబావి నీటిలో పడి మృతి చెంది నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం స్థానికులు బావిలో తేలియాడుతున్న మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపారు. మతిస్థిమితం లేకపోవడంతోనే బావిలో పడి మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయంలో పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. భార్య పదేళ్ల కిందట మరణించగా కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు కూడా మతిస్థిమితం లేకుండా ఉన్నాడని స్థానికులు పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం

అచ్చంపేట టౌన్ సెప్టెంబరు20: మండల పరిధిలోని బుడ్డతండాకి చెందిన మహిళ గురువారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రాము తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుడ్డతండాకి చెందిన మహిళ ముడావత్ చిట్టి గురువారం నుంచి కనిపించడంలేదని భర్త మత్రు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలియజేశారు.


సర్వే బృందానికి సహకరించాలి



సోలార్ పంపుసెట్ ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దేవసహాయం

- అదనపు కలెక్టర్ దేవసహాయం
- సీఎం స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో సౌర విద్యుత్ ఏర్పాటుపై సమీక్ష

వంగూరు, సెప్టెంబరు 20: సోలార్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేయడం కోసం సర్వే బృందం సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో పర్యటిస్తుందని, వారికి రైతులు, గ్రామస్థులు సహకరించాలని అదనపు కలెక్టర్ దేవసహాయం అన్నారు. కొండారెడ్డిపల్లి గ్రామాన్ని దేవసహాయం, పలు శాఖల జిల్లా స్థాయి అధికారులు శుక్రవారం సందర్శించారు. గ్రామ పంచాయతీ భవనంలో ఫేజ్-2 వ్యవసాయ సోలార్ పంపుసెట్ల సర్వేపై అధికారులతో జరిగిన సమీక్షలో దేవ సహాయం, డీఆర్‌డీవో చిన్న ఓబిలేష్, జిల్లా పశువైద్య అధికారి రమేష్, ఎస్ఈ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటికే గృహ విద్యుత్ కనెక్షన్లపై సర్వే పూర్తి అయ్యిందని తెలిపారు. రేపటి నుంచి వ్యవసాయ, వాణిజ్య విద్యుత్ కనెక్షన్లపై సర్వే నిర్వహించాలని చెప్పారు. వ్యవసాయ, విద్యుత్ శాఖల సమన్వయంతో సర్వే పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సోలార్ విద్యుత్ పంపుసెట్ల ప్రయోజనాల గురించి రైతులకు వివరించాలన్నారు. సేకరించిన వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. గ్రామంలో 867 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, మూడు రోజుల్లో సర్వే పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం దేవసహాయం గ్రామ సమీపంలో రైతు రవీందర్‌రెడ్డి పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించాడు. అక్కడ ఉన్న రైతుతో మాట్లాడారు. సోలార్ పంపుసెట్ల ప్రయోజనాల గురించి తెలిపారు. పొలంలో సౌర పలకలు ఏర్పాటు చేసేందుకు కావాల్సిన స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ శ్రీధర్‌రెడ్డి, ఏడీ చంద్రశేఖర్, ఏఈ మేఘనాథ్, ఎంపీవో వెంకటేష్, మాజీ ఉప సర్పంచ్ వేమారెడ్డి, ఏపీవో శివశేఖర్, ఏపీఎం చంద్రయ్య, గోవర్ధన్‌రెడ్డి, వంశీ, అనిల్ పాల్గొన్నారు.



ట్యాబ్ ద్వారా యూడైస్ ప్లస్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేస్తున్న దామరగిద్ద మండలం కాన్‌కుర్తి హెచ్‌ఎం శేర్‌కృష్ణారెడ్డి

యూడైస్ ప్లస్ ప్రారంభం

- చురుకుగా పాఠశాలల అన్ని వివరాలు నమోదు
- దాని ఆధారంగా స్కూల్స్‌కు బడ్జెట్ కేటాయింపు
- విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ

నారాయణపేట, సెప్టెంబరు 20: రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలు ఆయా స్కూల్స్ యూడైస్ ప్లస్ పోర్టల్(యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్)లో నమోదు ప్రారంభమైంది. పాఠశాలల్లోని వసతులు, ఇతర వివరాలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్యను నమోదును చేస్తున్నారు. దీనివల్ల విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలలకు బడ్జెట్ కేటాయించడంతో పాటు వచ్చే విద్యా సంవత్సరానికి పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బిల్లుల కేటాయింపునకు అవకాశం ఉంటుంది. జిల్లాలోని విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు ఇదివరకే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. గత సంవత్సరం వరకు యూడైస్‌గా కొనసాగగా దానిని యూడైస్ ప్లస్‌గా నవీకరించారు. ప్రతీ మూడు గంటలకోసారి సాంకేతికత ఆధారంగా సమాచారం నవీకరించడం దీని ప్రత్యేకత. ఈ వెబ్‌సైట్‌లో పాఠశాల భౌతిక వనరులు, వసతులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలను మూడు భాగాలుగా విభజించి సమాచారం నమోదు చేస్తున్నారు. క్రీడా స్థలం ఉందా? లేదా?, తరగతి గదులు, ఇంకా కావల్సిన గదులెన్ని, అవసరమైన వసతులు వంటి వివరాలను ఎప్పటికప్పుడు అందులో పొందుపరుస్తున్నారు.

నెలాఖరులోగా పూర్తి చేస్తాం

యూడైస్ ప్లస్‌లో విద్యార్థుల వివరాలతో పాటు, ఉపాధ్యాయులు, పాఠశాలల్లో ఉన్న సౌకర్యాల నమోదు ప్రక్రియ ఈ నెలలో ప్రారంభమైంది. జిల్లాలో 671 పాఠశాలలకు గాను ఇప్పటికే 590 పాఠశాలల మౌలిక అవసరాలకు సంబంధించి వివరాలు పొందుపర్చి, అప్‌డేట్ చేశాం. ఉపాధ్యాయుల వివరాలు 90 శాతం క్రోడీకరణ పూర్తయ్యింది. విద్యార్థుల వివరాల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. అది ఈనెలాఖరులోపు పూర్తవుతుంది.


- అబ్దుల్ ఘని, డీఈవో

ప్రతీ విద్యార్థికి పెన్

యూడైస్ ప్లస్ నమోదు చేసిన తర్వాత ప్రతీ విద్యార్థికి పర్మినెంట్ ఎడ్యుకేషన్ నెంబర్(పెన్) కేటాయిస్తారు. దీనిద్వారా ఆ విద్యార్థి దేశ వ్యాప్తంగా ఏయే పాఠశాలల్లో ఏయే తరగతులు చదివాడు అనేది కచ్చితంగా తెలుస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా యూడైస్‌లో నమోదైన విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠ్య పుస్తకాలు, రెండు జతల యూనిఫామ్స్, నోట్ పుస్తకాలు పంపిణీ చేయనుంది. గత సంవత్సరం పదో తరగతి విద్యార్థుల నామినల్ రూల్స్ కోసం యూడైస్ డేటాను పరిగణనలోకి తీసుకున్నారు.

ఉపాధ్యాయులకు జాతీయ కోడ్

విద్యార్థుల మాదిరిగానే ఉపాధ్యాయులకు కూడా ఒక జాతీయ కోడ్(నంబర్)ను యూడైస్ కేటాయిస్తోంది. దీని ద్వారా ప్రతీ పాఠశాలలో కచ్చితంగా నమోదయ్యే విద్యార్థుల సంఖ్యతో పాటు, ఉపాధ్యాయుల సంఖ్య కూడా తెలుస్తుంది. దాంతో విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిని లెక్కించవచ్చు. యూడైస్ నమోదు కార్యక్రమాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేయనున్నారు.




తల్లికి పురుగుమందు తాపి.. తాను తాగిన కుమారుడు

గోపాల్‌పేట. సెప్టెంబర్ 20: మండలంలోని ఏదుట్లకు చెందిన గుగ్గిళ్ల రా జు, తన భార్య కాళమ్మ, తల్లి గుగ్గిళ్ల సాయమ్మ ముగ్గురు కూలీ పనులు చేసు కుంటూ జీవనం సాగిస్తుండేవారు. శుక్రవారం మధ్యాహ్నం రాజు మినుముల పంటకు పిచి కారి చేసే మందును తీసుకొచ్చి తల్లి సాయమ్మకు తాపించి, తాను తాగాడు. సాయమ్మ వాంతులు చేసుకోవడంతో గమనించిన చుట్టుపక్కన వారు వనపర్తి లోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. సాయమ్మ పరిస్థితి విషమంగా ఉండట ంతో మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. కళమ్మ కొం తకాలంగా పక్ష వాతంతో బాధ పడుతుండేది. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ హరిప్రసాద్ తెలియజేశారు.







కేజీబీవీ విద్యార్థులకు అస్వస్థత


ఆసుపత్రిలో చికిత్స పొంది వచ్చిన విద్యార్థినులు

మానవపాడు, సెప్టెంబర్ 20 : జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థి నులు అస్వస్థతకు గురయ్యారు. వారం రోజులుగా చర్మ వ్యాధులు, జ్వరాలతో బాధపడుతున్నారు. దీంతో ఏఎన్ఎం ప్రియాంక వారిని శుక్రవారం ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. పాఠశాలలో పారిశుధ్య లోపం, స్వచ్ఛమైన తాగునీరు లేకపోవడమే కారణమని తెలుస్తోంది. పాఠశాలలో 400 మంది విద్యార్థులున్నారు. మూడు రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో పంచాయతీ ట్రాక్టర్ నీరు తెప్పిస్తున్నారు. శుద్ధి చేయని నీటిని వినియోగించడంతోనే వ్యాధుల బారిన పడుతున్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన వాటర్ హీటర్ కూడా పని చేయడం లేదు.





ఆర్ఎంపీ సమీర్‌పై నిర్భయ కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 20: జిల్లా కేంద్రానికి చెందిన సహస్ర న్యూ లైఫ్ ఆసుపత్రి యజమాని, ఆర్ఎంపీ మహమ్మద్ సమీర్‌పై నిర్భయ చట్టంతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సీఐ కనకయ్య తెలియజేశారు. శుక్రవారం సీఐ విలేకరులతో మాట్లాడారు. తాడూరు మండలం యత్మతాపూర్‌కి చెందిన సింగిరెడ్డి స్వప్నతో ఆర్ఎంపీ అసభ్యంగా ప్రవర్తించి లైంగికంగా వేధించాడని ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని వివరించారు. విచారణ కొనసాగుతుందని, త్వరలోనే అరెస్ట్ చేస్తామని వెల్లడించారు. ఇదిలా ఉండగా.. నిందితుడు గురువారమే పారిపోయినట్లు సమాచారం. ఆసుపత్రి ఎదుట రాజకీయ, ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రాస్తారోకో, ధర్నా నిర్వహించిన విషయం విధితమే.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత

వెల్దండ, సెప్టెంబరు 20 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని చౌదర్‌పల్లిలో తప్పిపోయిన బాలుడిని పోలీసులు శుక్రవారం తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చౌదర్‌పల్లికి చెందిన ఆరో తరగతి విద్యార్థి సంతోష్ సమీపంలోని రాఘాయిపల్లిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుకుంటున్నాడు. ఈ క్రమంలో సదరు విద్యార్థి పాఠశాలకు వెళ్తానని చెప్పి వెళ్లలేదు. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు వెల్దండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించి, విద్యార్థిని కనిపెట్టి తల్లిదండ్రులకు అప్పగించారు.

దారి దోపిడీకి పాల్పడిన నిందితుల అరెస్ట్


నిందితులను చూపిస్తున్న పోలీసులు

జడ్చర్ల, సెప్టెంబరు 20 : దారి దోపిడీకి పాల్పడిన ఇద్దరు నిందితులను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చిన్న వయస్సులోనే బైక్ చోరీ చేసిన కేసులో జైలుకు వెళ్లి వచ్చిన భూత్పూర్ మండలం, కొత్తూరుకు చెందిన మెట్టశివశంకర్, దివిటిపల్లికి చెందిన షేక్ లతీఫ్‌లు ఈ నెల 17న దారిదోపిడీకి పాల్పడ్డారు. జడ్చర్ల మునిసి పాలిటీ బురెడ్డిపల్లి సమీపంలోని పెట్రోల్‌బంక్ వద్ద తన గ్రామానికి వెళ్లేందుకు అడ్డాకుల మండలం పొన్నకల్‌కి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వనం బురాన్ నిలబడగా.. అదే దారిలో శివశంకర్, లతీఫ్‌లు బైక్‌పై వెళ్తూ.. భూత్పూర్‌లో దింపుతామంటూ ఎక్కించుకున్నారు. బురెడ్డిపల్లి స్టేజి దాటిన అనంతరం జాతీయరహదారి పక్కన ఓ వెంచర్‌లోకి తీసుకెళ్లి వనం బురాన్‌ను కత్తితో చేతికి గాయపరిచారు. అతడితో ఉన్న రూ.2,200, మొబైల్‌ఫోన్‌ను లాక్కున్నారు. తాజాగా జడ్చర్ల ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నిందితులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని రూ.1,160 నగదు, రెండు సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ వెల్లడించారు.







అసౌకర్యాల మధ్య చదువులు

- ఆత్మకూరు డిగ్రీ కళాశాలలో వేధిస్తున్న సమస్యలు
- సరిపడా తరగతి గదులు, వసతులు లేక విద్యార్థుల ఇక్కట్లు
- కళాశాలకు వెళ్లాలంటే మూడు కిలో మీటర్ల నడవాల్సిన పరిస్థితి



ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఆత్మకూరు, సెప్టెంబరు 20 : విద్యార్థుల చదువులు అసౌకర్యాల నడుమ కొనసాగుతున్నాయి. చదువుకుందామంటే కళాశాలలో సరైన గదులు, మౌలిక వసతులు లేకపోవడంతో చదువుపై విద్యార్థులు దృష్టి సారించలేకపోతున్నారు. సమస్యలను ఉన్నతాధికారులకు తెలిపినా పట్టించుకునేవారు లేరని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వాపోతున్నారు.

వనపర్తి జిల్లా ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమస్యలకు నిలయంగా మారింది. డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసినా అందుకు తగ్గ సౌకర్యాలు కల్పించలేదు. బస్సు రవాణా, తరగతి గదులు, తాగునీటి, ప్రహరీ గోడ వంటివి ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు నిమిత్తం ఆత్మకూరు పట్టణ పరిధిలో ప్రభుత్వ స్థలం లేకపోవడం కారణంగా మూడు కిలో మీటర్ల దూరంలో ప్రియదర్శిని జూరాల ఎడమ కాలువ పక్కన ప్రభుత్వ స్థలం నాలుగు ఎకరాలు, అలాగే మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి సొంత పట్టా పొలం ఎకరం ఇవ్వడంతో ఐదు ఎకరాలలో డిగ్రీ కళాశాలను 2016లో నిర్మించారు.



కాలినడకన కళాశాలకు వెళ్తున్న విద్యార్థులు

నాలుగు మండలాల నుంచి 310 మంది విద్యార్థులు

మదనాపురం, చిన్నచింతకుంట, అమరచింత, ఆత్మకూరు మండలాల నుంచి ఆయా కోర్సులలో 310 మందికిపైగా విద్యార్థులు కళాశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. అందుకు సరిపడా తరగతి గదులు లేకపోవడంతో ఈజీఎస్ నిధుల నుంచి రూ.కోటి వెచ్చించి మొదటి అంతస్తులో మరో ఐదు గదులను నిర్మించారు. కానీ పైకి ఎక్కేందుకు మెట్లు లేకపోవడంతో తరగతి గదులు ఏర్పాటు చేసిన ఉపయోగించుకునే అవకాశం లేకుండా పోయింది. దీనికి తోడు మిషన్ భగీరథ నీరు ఫిల్టర్ కాకుండా రావడంతో విద్యార్థులు తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నారు. డిగ్రీ కళాశాలలో ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటుకు ఆదేశాలున్నా సంబంధిత గుత్తేదారు ఎప్పటికీ స్పందించకపోవడం కారణంగా బయటి నుంచి శుద్ధ జలాలను తెచ్చుకునే దుస్థితి నెలకొంది.

క్లాసులు మిస్ అవుతున్నారు



నాలుగు మండలాల నుంచి 310కి పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. సరిపడా తరగతి గదులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా విద్యార్థులు కాలినడకన వచ్చే వరకు తరగతులు అప్పటికే ప్రారంభం కావడంతో క్లాసులు మిస్ అవుతున్నారు. బస్సు సౌకర్యం కల్పిస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది. దీని ద్వారా విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

- డాక్టర్ గోపాల్, ప్రిన్సిపాల్

ప్రత్యేక బస్సు నడపాలని డిమాండ్

కళాశాల వేళలు ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు ఉండడంతో విద్యార్థులు గ్రామాల నుంచి ఆత్మకూరు బస్టాండ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి బస్సు లేకపోవడంతో కళాశాల ప్రారంభ సమయానికి మూడు కిలోమీటర్లు కాలినడకన వెళ్లక తప్పడం లేదు. ఇది వరకు రేచింతల నుంచి వయా రైల్వే స్టేషన్ మీదుగా ఆత్మకూరు బస్టాండ్ వరకు ఆర్టీసీ బస్సు ఉండేది. విద్యార్థులు 9 గంటలకు బస్టాండ్‌కు చేరుకోవడంతో తిరుగు ప్రయాణంలో బస్సు సద్వినియోగం చేసుకునే అవకాశం ఉండేది. అదే మాదిరిగానే ప్రస్తుతం బస్సును పునరుద్ధరించాలి. ఈ విషయంపై మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చర్యలు తీసుకొని బస్సు కళాశాల వరకు వచ్చేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సరిపడా గదులు లేవు



కళాశాలలో ఐదు గ్రూపులకు సంబంధించి వి ద్యార్థులకు ఐదు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. లైబ్రరీ, ల్యాబ్స్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మొదటి ఫ్లోర్ ఉన్నా ఎక్కేందుకు మెట్లు వేయకపోవడంతో తరగతి గదులు సద్వినియోగం చేసుకునే అవకాశం లేకుండా పోయింది.

- పల్లవి, విద్యార్థిని

ప్రహరీ ఏర్పాటు చేయండి



ఆత్మకూరు పట్టణ కేంద్రానికి మూడు కిలో మీటర్ల మేర అడవిలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశారు. కానీ ప్రహరీ గోడ ఏర్పాటు చేయకపోవడంతో పశువులు, గొర్రెలు కళాశాల ఆవరణలోకి వస్తున్నాయి. దీనికి తోడు ప్రధాన ఎడమ కాలువ పక్కనే ఉండడంతో విష సర్పాలు వచ్చే అవకాశం ఉంది. అలాగే కళాశాలలో ఆర్‌వో ప్లాంటు ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యం కల్పించాలి.

- శివకుమార్, విద్యార్థి

బస్సు సౌకర్యం కల్పించాలి



ఆత్మకూరు పట్టణ కేంద్రానికి కళాశాల దూరంగా ఉన్నందున ప్రతి రోజు కాలినడకన వెళ్తున్నాం. ఇది వరకు ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండ్‌కు 9 గంటల సమయంలో విద్యార్థులందరూ చేరుకుంటారు. అక్కడ నుంచి కళాశాల వరకు ప్రత్యేకంగా బస్సు నడిపితే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది.

- మహేశ్వరి, విద్యార్థిని

నేటి నుంచి నీటి సరఫరాలో అంతరాయం

మహబూబ్‌నగర్ టౌన్/ నారాయణపేట టౌన్, సెప్టెంబరు 20 : నారాయణపేట, మక్తల్, దేవరకద్ర నియోజకవర్గాల్లో శనివారం నుంచి సోమవారం వరకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మిషన్ భగీరథ గ్రిడ్ మహబూబ్‌నగర్ డివిజన్ అధికారి పుట్ట వెంకట్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరికల్ నుంచి నారాయణపేటకు వెళ్లే మార్గంలో మిషన్ భగీరథ పైపులైన్ నాలుగుచోట్ల లీకేజీలు అవుతున్నందున మరమ్మతులు చేసేందుకు సుమారు 48 గంటల సమయం పడుతుందని, ఇందుకోసం నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మన్యంకొండ నుంచి నీటి సరఫరా అయ్యే దేవరకద్ర, నర్వ, మరికల్, ఊట్కూరు, నారాయణపేట, దామరగిద్ద మండలాలు పూర్తిగా, అలాగే కొౌకుంట్ల, చిన్నచింతకుంట, మక్తల్, ధన్వాడ మండలాల్లో కొన్ని గ్రామాలకు, నారాయణపేట మునిసిపాలిటీలో 48 గంటల పాటు నీటి సరఫరా ఉండదని తెలిపారు. 245 గ్రామాల్లో, అలాగే రెండు మునిసిపాలిటీల పరిధిలో నీటి సరఫరా ఉండదని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కొండాపూర్ విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ధన్వాడ, సెప్టెంబరు 20: నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం కొండాపూర్ ఎస్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజారాం శుక్రవారం తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు తరఫున కొండాపూర్‌కు చెందిన లోకేష్, ప్రవీణ్, విష్ణు పాల్గొంటున్నట్లు తెలిపారు. విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంపై ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సాంబయ్యనాయక్, పీఈటీ సుగుణకర్‌రావు, కోచ్ రామ్మోహన్‌గౌడ్ అభినందించారు.

సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన క్రీడాకారులు



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొన్న క్రీడాకారులు

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 20: సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. శుక్రవారం హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీ సింథటిక్ ట్రాక్‌లో జరిగిన అథ్లెటిక్స్‌లో షాట్‌పుట్ అండర్-20 విభాగంలో ఎస్.బుచ్చమ్మ స్వర్ణ పతకం, డిస్కస్‌త్రోలో రజత పతకం సాధించింది. అదేవిధంగా అండర్-20లో 3వేల మీటర్ల పరుగులో గడ్డం రాజేశ్వరి స్వర్ణం సాధించగా, 1,500 మీటర్ల పరుగులో కాట్రవత్ శ్రీను స్వర్ణం సాధించాడు. జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచడంపై జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి స్వాములు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

రేపు అండర్-19 ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 20: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అండర్-19 క్రికెట్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టును ఆదివారం ఎండీసీఏ మైదానంలో ఉదయం 10 గంటలకు ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 1, 2005 తర్వాత జన్మించిన వారు ఎంపికలకు అర్హులని పేర్కొన్నారు. ఎంపికలకు వచ్చే క్రీడాకారులు జనన ధ్రువపత్రం, ఆధార్‌కార్డు, పదో తరగతి మెమో, వైట్ డ్రెస్‌తో హాజరుకావాలని కోరారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు సర్టిఫికెట్ల అందజేత



ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో కోఆర్డినేటర్ ప్రవీణ

పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబరు 20 : పాలమూరు యూనివర్సిటీ పరిధిలో పలు కార్యక్రమాలలో అద్భుత ప్రదర్శన కనబరిచిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు, జాతీయ అడ్వెంచర్ క్యాంపులో శిక్షణ పూర్తి చేసిన వారికి శుక్రవారం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ వీయూ పరిపాలన భవనంలో సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొండ ప్రాంతాలలో సంభవిస్తున్న ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజలను ఏవిధంగా రక్షించాలనే అంశంలో వలంటీర్లు శిక్షణ పొందారని తెలిపారు. నార్కడ హిమాచల్ ప్రదేశ్‌లోని అత్యంత మంచు కురిసే ప్రాంతాలలో రాక్ క్లైంబింగ్, రివర్ క్రాసింగ్, రిపిలింగ్, ట్రెక్కింగ్, క్యాంపింగ్, నాయకత్వ లక్షణాలలో శిక్షణ పూర్తి చేశారని వివరించారు. వలంటీర్లకు ఈ సర్టిఫికెట్స్ ద్వారా ఉపాధి, ఉద్యోగ, విద్యా అవకాశాలలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి రవీందర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సుహాసిని పాల్గొన్నారు.

జిల్లాల వారీగా వర్గీకరణ చేయాలి



మాట్లాడుతున్న పిడమర్తి రవి

నారాయణపేట/పాలమూరు, సెప్టెంబరు 20 : ఎస్సీ వర్గీకరణ జిల్లాల వారీగా చేయాలని ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. శుక్రవారం నారాయణపేటకు చేరుకున్న మేలుకొలుపు యాత్ర సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఉమ్మడి పది జిల్లాల్లో మాదిగల జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఉమ్మడి జిల్లాలో మాదిగలకు 14 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. మేలుకొలుపు యాత్ర కొడంగల్, నారాయణపేట, మహబూబ్‌నగర్, గద్వాల జిల్లాల్లో కొనసా గుతుందని తెలిపారు. యాత్ర సాయంత్రం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చేరుకుంది. పాతపాలమూరు అంబేడ్కర్ చౌరస్తాలో విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ అంతటా మాదిగలకు 12శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. కార్యక్రమంలో మహేష్, వీరేందర్, మాధవ్, గణేష్, రాంబాబు, వజీత్, తాయప్ప, పాండు, రమేష్, చంటి, హనుమంతు, కన్నయ్య, ప్రభు, బాబు, వినోద్, రాజు, రాములు, బొర్ర సురేష్, కౌన్సిలర్ శ్రీనివాసులు, మిట్ట యాదయ్య, గోపాలక్రిష్ణ, రాయికంటి రాందాసు, సింగిరెడ్డి పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహాన్ని ఢీకొట్టిన బూడిద ట్యాంకర్



ధ్వంసమైన విగ్రహం కట్ట

కృష్ణ, సెప్టెంబర్ 20 : నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలోని హిందుపూర్ చౌరస్తాలో శుక్రవారం తెల్లవారుజామున మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఓ బూడిద ట్యాంకర్ లారీ ఢీకొట్టింది. లారీ టైరు ఒక్కసారిగా పగిలిపోవడంతో విగ్రహం వైపు దూసుకుపోయి కట్టను ఢీకొట్టింది. తెల్లవారుజామున ఘటన చోటు చేసుకోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం కాలేదు. విషయం తెలుసుకున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు ట్యాంకర్ యజమానితో చర్చలు జరిపారు. విగ్రహాన్ని నూతనంగా తయారు చేయించి ఇస్తామని యజమాని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

పర్యాటక అభివృద్ధికి సహకరించండి

- స్పెయిన్ రాయబారిని కోరిన మంత్రి జూపల్లి కృష్ణారావు



స్పెయిన్ రాయబారితో మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, సెప్టెంబర్ 20 : రాష్ట్ర పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు సహకారం అందించాలని స్పెయిన్ రాయబారి హువన్ అంతోనియో మార్చ్ పుజోల్‌ను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డా.బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిసి, ఇరు ప్రాంతాల పర్యాటక రంగాలపై చర్చించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచన మేరకు ఘనమైన తెలంగాణ చరిత్ర, సంస్కృతి, వారసత్వం కేంద్రంగా పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రపంచస్థాయి మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు మంత్రి స్పెయిన్ రాయబారికి వివరించారు. జీవ వైవిధ్యం, ప్రకృతితో అనుసంధానమైన జీవన విధానం వంటివి భారతదేశంలో పర్యాటకాభివృద్ధికి సానుకూలమైన అంశాలని స్పెయిన్ రాయ బారి అన్నారు. పర్యాటక రంగం అభివృద్ధికి తమ వంతు సహకారాన్ని అందిస్తామని ఆయన తెలిపారు. పర్యాటకులకు స్వర్గధామమైన స్పెయిన్‌ను సందర్శించాలని మంత్రి జూపల్లిని కోరారు. సమావేశంలో పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య విజ్ఞానాన్ని పెంపొందించడమే లక్ష్యం

- ఎస్వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డా. కేజే రెడ్డి



స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎస్వీఎస్ విద్యాసంస్థల డైరెక్టర్లు, సిబ్బంది

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) సెప్టెంబర్ 18: విద్యార్థుల్లో వైద్య విజ్ఞానాన్ని పెంపొందించడమే తమ వైద్య కళాశాల లక్ష్యమని ఎస్వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డా. కేజే రెడ్డి అన్నారు. ఎస్వీఎస్ ఆసుపత్రి, వైద్య కళాశాలను స్థాపించి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎస్వీఎస్ మెడి ఎక్స్‌పో-2024 పేరుతో వైద్య విద్య విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సైన్స్ పరిజ్ఞానం విపరీతంగా పెరిగిపోయిందని, దానికి అనుగుణంగా విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించి భవిష్యత్‌లో ప్రతి ఒక్కరు శాస్త్రవేత్తలు కావడానికి ఇలాంటి సదస్సులు ఎంతగానో తోడ్పడతాయని అన్నారు. విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే సైన్స్‌పై విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించడం వలన వారిలో ఉండే శాస్త్రసంకేతికతను ప్రపంచానికి తెలియజేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు కూడా ఈ సదస్సు ఉపయోగపడుతుందని, వైద్యశాస్త్రంలో మెలకువలతో పాటు పరిజ్ఞానం కూడా పెరగడంతో విద్యార్థులకు నాణ్యమైన వైద్య బోధనను అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కళాశాలలోని 25 విభాగాలకు సంబంధించి మొత్తం 1,200 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి స్టాల్‌ను డైరెక్టర్లు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సదస్సు నాలుగు రోజుల పాటు ఈనెల 23 వరకు కొనసాగుతున్నట్లు తెలిపారు.

ఉద్యోగులు బాధ్యతతో పనిచేయాలి

- డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి

పాలమూరు, సెప్టెంబరు 20: డీసీసీబీలో పనిచేసే ఉద్యోగులు భయంతో కాకుండా బాధ్యతతో పనిచేయాలని చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీసీసీబీ ఆడిటోరియంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు, శాఖ నిర్వహణ అధికారులు, సిబ్బంది సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సొసైటీలు పూర్తి స్థాయిలో మెరుగుపడాలని, లేని పక్షంలో ఇబ్బందుల్లో పడుతాయన్నారు. వ్యాపార అభివృద్ధి లక్ష్యంగా సొసైటీలు పనిచేసే రైతులకు మరింతగా సేవలందించే విధంగా తయారు కావాలన్నారు. సీఈఓలు చేసిన తప్పు మూలంగానే డీసీసీబీ సీఈఓ లక్ష్మయ్య సస్పెన్షన్‌కు గురయ్యారని, ఆయన తప్పు చేసి సస్పెండ్ కాలేదన్నారు. ఇప్పటికి ముగ్గురు డీసీసీబీ సీఈఓలు సస్పెన్షన్‌కు గురవటం బాధాకరమన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గుచూపాలి



నంది వడ్డెమాన్‌లో మాట్లాడుతున్న కేవీకే కోఆర్డినేటర్ ప్రభాకర్ రెడ్డి

బిజినేపల్లి, సెప్టెంబరు 20 : రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని నంది వడ్డెమాన్, పాలెం రైతు వేదికల్లో శుక్రవారం ఏఈఓలకు నీరు, భూమి యాజమాన్యంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. బిందు, తుంపర సేద్యం ద్వారా తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేపట్టి అధిక లాభాలను పొందవచ్చని రైతులకు అవగాహన కల్పించాలని ఏఈఓలకు సూచించారు. వర్షాధార ప్రాంతాల్లో నీటి సంరక్షణ పద్ధతులు పాటించి భూగర్భ జలాల పెంచేందుకు రైతులకు సూచనలు ఇవ్వాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా బీజామృతం, జీవామృతం, మల్చింగ్, పంచకావ్యం, ఎగ్‌సెల్ ఎరువు తయారీ ఉపయోగాలు వివరించారు. కార్యక్రమంలో ఏడీఏలు వాసు, పూర్ణ చంద్రారెడ్డి, కనక రాజు, సునీత, ఎంఏవో నీతి రెడ్డి, నేటాఫిల్మ్ డీజీఎం సుబ్బారావు, ఏఈఓలు పాల్గొన్నారు.

ఏఈఓల సమస్యలను పరిష్కరించాలని వినతి

ఏఈఓల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని శుక్రవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. 6,500 ఎకరాలకు ఒక ఏఈఓ ఉండడంతో పని ఒత్తిడితో అనారోగ్యాల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్(వీఏఏ)తో విజయవంతంగా డిజిటల్ పంటల వివరాల నమోదు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రత్యేక అధికారులుగా అదనపు బాధ్యతలతో పని ఒత్తిడికి లోనవుతున్నామని, సత్వరమే ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని కోరారు. న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఈనెల 27 నుంచి నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

మతాన్ని కించపరిచిన ఇద్దరిపై కేసు నమోదు

గద్వాల క్రైం, సెప్టెంబరు 20: ఓ మతాన్ని కించపరుస్తూ పోస్టులు పెట్టిన వ్యక్తితో పాటు అడ్మిన్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఒక మతాన్ని కించపరుస్తూ లక్ష్మన్ సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఇందుకు సంబంధించి ఎస్ఐకు ఫిర్యాదు చేయడంతో లక్ష్మన్‌తో పాటు అడ్మిన్ నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలి




ప్రయాణికులకు గులాబీ అందిస్తున్న ఆర్ఎం

మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 20: ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే వారితో సిబ్బంది మర్యాదపూర్వకంగా మెలగాలని ఆర్ఎం శ్రీదేవి సూచించారు. శుక్రవారం కర్టసి డే (మర్యాద దినోత్సవం) సందర్భంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణికులకు ఆర్ఎం శుభాకాంక్షలు తెలిపారు. సేఫ్ జర్నీ హ్యాపీ జర్నీ అంటూ బస్సులలో ప్రయాణికులు పలకరించి గులాబీలు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి: కేసు నమోదు

ఖిల్లాఘణపురం, సెప్టెంబరు20: ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. వనపర్తి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సుపై గురువారం రాత్రి డ్రైవర్ మోడేలా శ్రీనివాసులు వనపర్తి నుంచి ఖిల్లాఘణపురం వెళ్తున్నాడు. షాపూర్ శివారులో రోడ్డు పనుల కారణంగా బస్సును నిదానంగా నడుపుతుండగా, షాపూర్ చెందిన యువకుడు కల్లెం కుమార్ రోడ్డుపై అడ్డంగా వచ్చి బైక్‌ను నిలిపాడు. డ్రైవర్‌పై దాడికి పాల్పడి, దుర్భాషలాడాడు. విధులు ముగించుకున్న అనంతరం పోలీస్ స్టేషన్‌లో డ్రైవర్ ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. డ్రైవర్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

నాగర్‌కర్నూల్‌లో ఇద్దరు యువకుల అదృశ్యం



వెంకటేష్‌చారి

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 20 : జిల్లా కేంద్రానికి చెందిన ఫొటోగ్రాఫర్ వెంకటేశ్‌చారి అదృశ్యమైనట్లు ఎస్ఐ రమాదేవి శుక్రవారం తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీనగర్‌కాలనీలో నివాసం ఉంటున్న వెంకటేష్‌చారి శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో ఇంట్లో ఒక లెటర్ రాసి పెట్టి తనకోసం ఎవరూ వెతకవద్దని ఫోన్, కెమెరా, బైక్‌ను ఇంట్లోనే పెట్టి వెళ్లిపోయాడు. లెటర్ చదివిన తర్వాత తల్లి అలివేలు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అదేవిధంగా కోటాలగడ్డ చెందిన కురుమూర్తి కొన్ని రోజుల నుంచి జిల్లా కేంద్రంలో హౌసింగ్‌బోర్డు కాలనీలో నివాసం ఉంటున్నాడు. జిల్లా కేంద్రంలోని సాయిట్రేడర్స్‌లో పని చేస్తూ భార్యాపిల్లలను పోషిస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున 4గంటల సమయంలో ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లినట్లు అతని భార్య పుష్ప ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సమయపాలన పాటించాలి

- ఆరోగ్య కేంద్రాల సిబ్బందికి కలెక్టర్ విజయేందిర ఆదేశాలు

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), సెప్టెంబరు 20 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాల డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. శుక్రవారం ఆమె వైద్య, ఆరోగ్యశాఖ కార్యక్రమాలపై ప్రాథమిక వైద్య, ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, సబ్‌సెంటర్లు మెడికల్ ఆఫీసర్లతో వెబెక్స్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లలో అన్ని రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఆస్పత్రుల ఆవరణలు పరిశుభ్రంగా ఉండాలని, ఫీవర్ సర్వేను పర్యవేక్షణ చేయాలని, ప్రతీ నెల 1వ తేదీన గ్రామహెల్త్, శానిటేషన్, న్యూట్రిషన్ దినోత్సవం నిర్వహించాలని తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి పద్మ తదితరులు కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

ఆయిల్ పామ్ తోటల పెంపకంపై సమీక్ష

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్) : ఈ సంవత్సరం జిల్లాలో నిర్దేశించిన 2500 ఎకరాల ఆయిల్ పామ్ తోటల పెంపకం లక్ష్యాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. శుక్రవారం ఆమె తన చాంబర్లో జిల్లా స్థాయి ఆయిల్ పామ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్ పామ్ తోటల విస్తరణతో పాటు, ఆయిల్ పామ్ మొక్కలను నాటడం త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. గుర్తించిన రైతులను ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో గల పాత ఆయిల్ పామ్ తోటల సందర్శనకు తీసుకువెళ్లాలని తెలిపారు. ఉద్యాన, వ్యవసాయ శాఖలే సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ తోటలకు పట్టి చీడ, పీడలు యూనిట్ కాస్ట్ పెంచడం తదితర అంశాలపై చర్చ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యానన శాఖ అధికారి వేణుగోపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి

- వెన్నాచేడ్ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ విజయేందిర

గండీడ్, సెప్టెంబరు 20 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ విజయెంద్రా బోయి అన్నారు . శుక్రవారం మండల పరిధిలోని వెన్నాచేడ్ ప్రాథమిక పాఠశాల , బాలికల ఉన్నత పాఠశాల , అంగనివాడి సెంటర్లను తనిఖీ చేశారు .సల్కర్‌పేట్ గ్రామంలో సబ్‌సెంటర్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన బోజనంతో పాటు విద్య బోధించాలని తెలిపారు. మధ్యాహన్న బోజనం నీళ్ళ చారు చేయడమా ఏమి చేస్తున్నారని మండిపడ్డారు . అంగనివాడి సెంటర్లో గుడ్లు మరియు ఇతర పౌష్టిక ఆహారం అందిస్తున్నారా అని చిన్నారులను అడిగి తెలుసుకున్నారు . సూపర్‌వైజర్ సెంటర్లను తనిఖీ చేయడము లేదా అని మండి పడ్డారు. సక్రమంగా పని చేయకుంటే అంగనివాడి టీచర్ల పై చర్యలు తీసుకోవాలని సూపర్‌వైజర్‌లకు ఆదేశించారు. గ్రామంలో సబ్‌సెంటర్‌లో బీపీ, సుగర్ వ్యాధులకు సమయానికి టెస్టులు , మందులు అందించాలని తెలిపారు. రికార్డులను తప్పకుండ పాటించాలని పేర్కోన్నారు . గ్రామంలో షానిటైజర్ ,మురుగుకాలువలను శుభ్రంలో నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు పుల్లా రెడ్డి , గోపాల్ , గ్రామ కార్యదర్శి కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించి మండలానికి పేరు తేవాలి

- మండల స్థాయి క్రీడల ప్రారంభంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



క్రీడాకారులతో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

రాజాపూర్, సెప్టెంబరు 20 : మండల పరిధిలోని తిరుమలాపూర్ గ్రామంలో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీను శుక్రవారం జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి క్రీడలతో పాటు మంచిగా చదువుకొని మండలానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కాసేపు విద్యార్థులు, నాయకులతో క్రీడలు ఆడారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, కృష్ణయ్య, గోనెల రమేష్, గోవర్ధన్‌రెడ్డి, నరహరి, విక్రమ్‌రెడ్డి, వెంకటేష్, ఎంపీడీవో మచ్చేందర్, ఆర్గనైజర్స్ సుధాకర్, రాములు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడా పోటీలు ప్రారంభం

మహబూబ్‌నగర్ రూరల్, సెప్టెంబరు 20 : మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని ధర్మాపూర్ జడ్పీహెచ్ పాఠశాలలో శుక్రవారం అండర్-17, అండర్-14 గ్రామీణ క్రీడా పోటీలను ఎంఈవో లక్షణ్‌సింగ్, మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పీఈటీలు, ఉపాధ్యాయులు ప్రారంభించారు. బాల, బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో పోటీలను నిర్వహించారు. రెండు రోజులు జరిగే ఈ పోటీలలో గెలుపొందిన టీంలకు బహుమతులు అందజేస్తామని ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంలు కృష్ణయ్య, వెంకటేశ్వరమ్మ, ఉషా, రవీందర్‌గౌడ్, యాదయ్య, పీఈటీ చంద్రశేఖర్ గౌడ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

- డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పద్మ

రాజాపూర్, సెప్టెంబరు 20 : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగులకు వైద్యులు, సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని డీఎమ్‌అండ్‌హెచ్‌వో డాక్టర్ పద్మ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది హాజరుపట్టికలను, మందుల నిల్వ రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలోని రోగులకు ఎలాంటి వైద్యం అందిస్తున్నారో రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో సిబ్బంది కొరత ఉన్నదని రోగులు డీఎమ్‌అండ్‌హెచ్‌వో దృష్టికి తీసుకుపోయారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్‌రావు ఉన్నారు.

తెలంగాణ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర

- సాయిచంద్ జయంతిలో గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజనీసాయిచంద్



అడ్డాకులలో కేక్‌కట్ చేస్తున్న గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజనీసాయిచంద్

అడ్డాకుల, సెప్టెంబరు 20 : తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తిదాయకమైన పాటలతో అసంఖ్యాక ప్రజల హృదయాలను తెలంగాణ సాధనవైపు నడిపించిన సాయిచంద్ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజనీసాయిచంద్ అన్నారు. శుక్రవారం అడ్డాకుల మండల కేంద్రంలో ఓ హోటల్ ఆవరణలో స్వర్గీయ సాయిచంద్ జయంతి వేడుకలను ఆల యువసైన్యం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయిచందు సతీమణి శ్రీవేదసాయిచంద్ పాల్గొని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం కేక్ కట్ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యువ నాయకులు మాట్లాడుతూ ఆయన తెలంగాణ పునర్నిర్మాణంలో సాయిచంద్ సేవలను కొనియాడారు.

● జడ్చర్ల : సాయిచంద్ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని అంబేడ్కర్ కళా భవన్‌లో 40 మంది రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని సాయిచంద్ భార్య రజనీసాయిచంద్ ప్రారంభించారు. కార్యక్రమంలో సామాజికవేత్త కాల్వ రాంరెడ్డి, కాల్వ రాధిక, విక్కీసింగ్, ఎంఈవో మంజులాదేవి, దత్తుకుమార్, ఫరీద్, సాయిచంద్ అభిమానులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

దేవరకద్ర, సెప్టెంబరు 20 : రైతులు తమ పంటలకు సేంద్రియ ఎరువులు వాడితే అధిక దిగుబడి వస్తుందని ఏరువాక కేంద్రం పాలెం శాస్త్రవేత్తల బృందం భరత్‌కుమార్, వ్యవసాయ సహాయ సంచాలకుల యశ్వంత్‌రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దరాజమూర్ గ్రామంలో రైతులు వేసిన పంటలను వారు పరిశీలించి మాట్లాడారు. వరిలో కాండం తొలుచుపురుగు, బాక్టీరియా ఎండాకుతెగులు వంటి నివారణకు చర్యలు, వరి పొలంలో పోషకాల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, విజయలక్ష్మి, దివ్యరాణి, మండల వ్యవసాయాధికారి రాజేందర్ అగర్వాల్ విస్తరణ అధికారి హరీశ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- స్వచ్ఛతాహీ సేవ, డ్రైడేను పరిశీలించిన జడ్పీ సీఈవో

జడ్చర్ల, సెప్టెంబరు 20 : జడ్చర్ల మండలంలో స్వచ్ఛతాహి సేవ, డ్రై డే కార్యక్రమాన్ని శుక్రవారం జడ్చర్ల మండల ప్రత్యేక అధికారి, జడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి పరిశీలించారు. మండలంలోని ఆలూరు గ్రామంలో ఎంపీడీవో విజయ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా గ్రామస్థులకు సూచించారు. అనంతరం జడ్చర్ల ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సరోజ, ఎంఈవో మంజులాదేవి, వెంటర్నరీ డాక్టర్ ఆశారాణితో పాటు మిషన్‌భగీరథ, ఐకేపీ, వ్యవసాయశాఖ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్ అమలుకు పోరాడుదాం'

పాలమూరు, సెప్టెంబరు 20 : మాదిగ, మాల అనుబంధ కులాలు వర్గీకరణ పెంపు కోసం, ప్రైవేటు రంగాలలో రిజర్వేషన్ అమలుకు పోరాటాలు చేయడానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్(ఆర్.ఆర్)-మాదిగ సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఎల్.రమేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు రాయికంటి రాందాసు మాట్లాడారు. ధర్మం గెలిచిన సభను వాయిదా వేస్తూ నవంబర్‌లో నిర్వహించాలని తీర్మానించినట్లు తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు ఎవరి విజయంకాదు, ఎవరి అపజయం కాదన్నారు. ఎస్సీ వర్గీకరణ మాదిగ, మాల అనుబంధ కులాలు జనాభా నిష్పత్తి ప్రకారం జరగాలన్నారు. అందుకోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కమిటీని వేయటంపై హర్షం ప్రకటించారు. కార్యక్రమంలో రాయికంటి రాందాసు, సింగిరెడ్డి పరమేశ్వర్, మీసాల రాము, ఎల్.రమేష్, కాలే నరేందర్, తిర్మలయ్య, అమరచింత విజయ్, బి.రాములు, ఎ.బిక్షపతి, వన్నాడ అంజన్న, దండు దేవనన్న, పి.నగేష్, సి.నరసింహులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా రాము నాయక్



ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా కమిటీతో రాష్ట్ర నాయకులు

పాలమూరు, సెప్టెంబరు 20 : లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడిగా ఎం.రాము నాయక్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు యం.రాంబల్, వి.చందర్‌నాయక్‌లు ప్రకటించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా కె.రాజు, గౌరవ అధ్యక్షుడిగా కె.శంకర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కె.యాదగిరి, అసోసియేషన్ అధ్యక్షులుగా ఆర్.శ్రీను, పి.బిఖ్యా కె.సీతారాం, వి.తులసి, వి.రాజు, కె.పెంట్యా, కె.రాములు, ఎల్.లక్ష్మణ్, కె.నరేందర్, కె.రవి, ఆర్.బిచ్యా, పి.మాన్య కె.నారాయణ, ఎం.చంటి, ఎం.రేఖ్యా, ఎం.శ్రీహరి, కోశాధికారిగా డాక్యానాయక్‌లను ఎన్నుకున్నట్లు వివరించారు.

తప్పుల్లేని ఓటరు జాబితాను తయారు చేయాలి

- ఓటర్ నమోదు సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్



హన్వాడలో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

హన్వాడ, సెప్టెంబరు 20 : తప్పుల్లేకుండా ఓటరు జాబితాను తయారు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు బీఎల్‌వోలకు సూచించారు. శుక్రవారం మండలంలోని హన్వాడ, నాయినోనిపల్లి, చిన్నదర్పల్లి, గొండ్యాల గ్రామాలలో బీఎల్‌వోలు చేపడుతున్న ఇంటింటి ఓటర్ నమోదు సర్వేను ఆయన పరిశీలించారు. ఒక ఇంటి వద్ద అందరి పేర్లు ఉన్నాయా, కొత్త ఓటర్ల పేర్లు నమోదు చేస్తున్నారా అని బీఎల్‌వోలను అడిగారు. ఆయన వెంట తహసీల్దార్ కిష్టానాయక్, సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, ఆర్ఐ సాదక్ పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌ల నిర్మాణానికి స్థలం చూడాలి

కోయిలకొండ : మండలంలోని రాంపూర్, అంకిళ్ల, కోయిలకొండ గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్‌ల నిర్మాణానికి వెంటనే స్థలం ఎంపిక చేసి నివేదిక అందించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు సూచించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖి నిర్వహించారు. నూతనంగా మంజూరు అయిన సబ్‌స్టేషన్‌ల నిర్మాణానికి భూ పరిశీలన చేశారా అని అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఓటరు నమోదు ఇంటింటి సర్వే వందశాతం పూర్తి చేయాలని సూచించారు. మండలంలో ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచరాదని, వెంటనే వాటిపై విచారణ జరిపి పరిష్కరించాలని ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌ల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజాగణేష్, డిప్యూటీ తహసీల్దార్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ పొర పరిరక్షణతోనే మానవ మనుగడ

- సమావేశంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య



డిగ్రీ కళాశాలలో ఓజోన్ పరిరక్షణకు విద్యార్థులు వేసిన పోస్టర్‌లను తిలకిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

జడ్చర్ల, సెప్టెంబరు 20 : ఓజోన్ ‌పొర పరిరక్షణ మనందరి బాధ్యత అని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య అన్నారు. జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓజోన్ పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకుని జంతుశాస్త్రం, రసాయనశాస్త్రం విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం 'ఓజోన్ క్షీణత, ప్రస్తుత పరిస్థితులు, మానవుని పాత్ర' అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య మాట్లాడుతూ ఆధునిక సమాజంలో మానవుని కర్యకలాపాలతో ఓజోన్ ఏ విధంగా క్షీణతకు గురవుతుందో వివరించారు. ఓజోన్ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని వివరించారు. కళాశాలలోని 84 మంది విద్యార్థులు 28 బృందాలుగా ఏర్పడి వివిధ రకాల పోస్టర్‌లను తయారు చేశారు. అత్యుత్తమ పోస్టర్‌లను తయారు చేసిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసులు, రుఖియాబాను, వేణు, పావని, నాగలక్ష్మి, ప్రవీణ్‌కుమార్, ఇశ్రత్‌సుల్తానా, వెంకటేశ్వర్లు, రజని, విక్రమ్‌కుమార్, రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీర్ లేనిదే అభివృద్ధి లేదు

- సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు
- పలువురు ఇంజనీర్లకు ఘన సన్మానం



ఇంజనీర్లను సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్ ఫోరం నాయకులు

మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 20 : ఇంజనీర్ లేనిదే దేశ అభివృద్ధి లేదని నిరూపించిన ఘనత మోక్షగుండం విశ్వేశ్వరయ్యది అని సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు అన్నారు. గత ఆదివారం ఇంజనీర్ దినోత్సవం ఉండగా, శుక్రవారం స్థానిక పారిశ్రామికవాడలోని ఫోరం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా నదులకు ఆనకట్టలు నిర్మించి దేశ ఆర్థికాభివృద్ధికి, భారతావని ప్రగతికి బలమైన పునాదులను నిర్మించిన ఘనత మోక్షగుండం విశ్వేశ్వరయ్యకే దక్కుతుందని అన్నారు. హైదరాబాద్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, మూసీనది వరద నివారణ, తిరుపతి ఘాట్‌రోడ్డు నిర్మాణం, వైజాగ్ పోర్ట్ నిర్మాణాలతో సహా పలు ప్రాజెక్టుల నిర్మాణాలు ఆయన మేధస్సుకు మచ్చు తునకలని ఆయన కొనియాడారు. ఆయన స్ఫూర్తితోనే నేడు అనేక మంది ఇంజనీర్లు కూడా దేశ ప్రగతిలో భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. అనంతరం పట్టణంలోని నలుగురు ఇంజనీర్లు రామలింగం, వెంకటరెడ్డి, భగవంతయ్య, అశోక్‌లను శాలువ, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అక్కినేని నారాయణరావు, నస్కంటి నాభూషణం, సూర్యనారాయణ రాజసింహుడు, విజయ్‌కుమార్, పోకల శివుడు, కెవి. అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కప్పెటలో కపిలేశ్వరస్వామి దేవాలయ నిర్మాణ పనులు ప్రారంభం



పూజలు చేసి ఆలయ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

భూత్పూర్, సెప్టెంబరు 20: మండలంలోని కప్పెట గ్రామంలో 800 ఏళ్ల నాటి కపిలేశ్వరస్వామి దేవాలయ పనులు పునఃప్రారభమయ్యాయి. ఆలయ ఆవరణలో శుక్రవారం గ్రామస్థులు, భక్తులు, శిల్పకారులు ఆలయ ఆవరణ మంటపం ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఆళ్ళగడ్డ ప్రాంతం నుంచి వచ్చిన దేవాలయ శిల్పికాళాకారులు విగ్రహాలను చెక్కే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి స్థానిక విలేకరులతో మాట్లాడారు. మాది 40 కుటుంబాలు ఉండే చిన్న గ్రామమని, చాలా ఏళ్ల నుంచి ఆలయ నిర్మాణం చేపట్టాలని అందరం అనుకున్నామని తెలిపారు. బయట ఎక్కడా విరాళాలు సేకరించకుండా మా గ్రామం వాళ్లమే అందరూ కలిసి విరాళాలు పోగు చేసుకోవాలని నిర్ణయించుకున్నామని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఆలయ నిర్మాణం చేపట్టి, వచ్చే ఏడాది జనవరి వరకు ప్రారంభించుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థలధాత జంగిరెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ వేణుగోపాలచారి, మాజీ వైస్ ఎంపీపీ నరేష్‌కుమార్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ మాసగౌడ్, దేవాలయ నిర్మాణ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

మిడ్జిల్, సెప్టెంబరు 20 : మండలంలోని దోనూర్, వల్లభురావుపల్లి, అయ్యవారిపల్లి, వాడియాల, వేముల, మిడ్జిల్, బోయిన్‌పల్లి గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు శనివారం ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి బూట్లు పంపిణీ చేస్తారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, నాయకులు సాయులు, వెంకటయ్య, బాల్‌రెడ్డి, గౌస్, మల్లికార్జున్‌రెడ్డి, జహంగీర్, వెంకటేష్‌గౌడ్‌లు శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డి తన స్వంత డబ్బులతో విద్యార్థులకు బూట్లను పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడలపై సమాశాలు నిర్వహించాలి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 20 : స్కూల్ గేమ్స్ క్రీడల నిర్వహణపై సమావేశం నిర్వహించాలని మహబూబ్‌నగర్ జిల్లా ప్రైవేటు పీఈటీల అధ్యక్ష, కార్యదర్శులు సోహెల్ ఉర్ రహెమాన్‌ఖాన్, వినోద్‌కుమార్, కోశాధికారి విజయ్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ అర్బన్, రూరల్ మండలస్థాయి క్రీడల ఎంపికలు నిర్వహించలేదని పేర్కొన్నారు. అక్టోబరు 2 నుంచి సెలవులు, ఆ తరువాత పరీక్షలు ఉంటాయని, ముందుగానే ఎంపికలు నిర్వహించాలని, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 20 : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల ఆర్థిక సమస్యలను పరిష్కరించాలని ఆల్‌మైనార్టీ ఎంప్లాయీస్ వర్కర్స్ అసోసియేషన్ (ఆల్‌మేవా) రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుక్‌హుస్సేన్ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రిటైర్డ్ ఉద్యోగస్తులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఆర్జిత సెలవుల బిల్లులు గత ప్రభుత్వం మాదిరిగానే ఈ కుబేర్‌ల పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. వెంటనే పెండింగ్ నిధులు విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

గుండె పోటుతో వాలీబాల్ క్రీడాకారుడి మృతి

నవాబ్‌పేట, సెప్టెంబరు 20 : మండలంలోని యన్మన గండ్ల గ్రామానికి చెందిన వాలీబాల్ క్రీడాకారుడు అయాజ్(35) గురువారం గుండె పోటుతో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన అయాజ్ గత కొంతకాలంగా పోలేపల్లి సెజ్ కంపెనీలో పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం ఉదయం ఇంటి పక్కల వారితో మాట్లాడుతూ కిందపడిపోయాడు. వారు జిల్లా కేంద్రంలోని ఓ ఆసుపత్రికి తరలించగా అప్పటికే గుండె పోటుతో మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. అయాజ్ చిన్ననాటి నుంచి వాలీబాల్ అంటే మక్కువ అని, మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆడి మంచి గుర్తింపు పొందాడు. అతని ఆకస్మిక మరణం పట్ల గ్రామస్థులు విచారం వ్యక్తం చేశారు.

క్రమ శిక్షణతో చదువుకోవాలి

హన్వాడ, సెప్టెంబరు 20 : విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకోవాలని ఎంపీడీవో యశోదమ్మ సూచించారు. శుక్రవారం మండలంలోని నాయినోనిపల్లి గ్రామంలోని పాఠశాలను ఆమె పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. కొన్ని ప్రశ్నలను విద్యార్థులను అడిగారు. అంతకు ముందు గ్రామంలో తిరిగి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. అదేవిదంగా గ్రామ పంచాయితీలో ఓటరు లిస్టు వార్డుల సవరణను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీవో కృష్టాజీ, కార్యదర్శి ఉమేష్ గ్రామ పెద్దలు పెద్ద చెన్నయ్య, మోహన్, నర్సిములు, బాలవర్ధన్ పాల్గొన్నారు.

విస్తృతంగా బీజేపీ సభ్యత్వ నమోదు

కోయిలకొండ, సెప్టెంబరు 20 : మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదును విస్తృతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ కో కన్వీనర్ కెంచె శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం కోయిలకొండలో బీజేపీ సభ్యత్వ నమోదు ప్రకియను పరిశీలించారు. మండల, గ్రామ నాయకుల సమన్వయంతో సభ్యత్వ నమోదు లక్ష్యం పూర్తి చేయాలని సూచించారు. ప్రధాన మంత్రి మోదీ అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి నాయకులు రాములుగౌడ్, గోవింద్ నాయక్, గురునాథ్, శ్రీధర్, వేణు, చెన్నయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పాల బిల్లులు సకాలంలో చెల్లించాలి

- పాడిపరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్‌ను కలిసిన బీఎంసీ చైర్మన్లు

మిడ్జిల్, సెప్టెంబరు 20: విజయ డెయిరీలో పాలు పోస్తున్న పాడిరైతులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని బీఎంసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, పలు గ్రామాల విజయ డెయిరీ అధ్యక్షులు కోరారు. శుక్రవారం వారు రాష్ట్ర పాడిపరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ అమిత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. దీంతో పాటు విజయ డెయిరీలో పాలు పోస్తున్న పాడిరైతులకు ఎదురవుతున్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని వారు కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన అమిత్‌రెడ్డి ప్రభుత్వం, విజయ డెయిరీ పెద్దల దృష్టికి పాడి రైతులు సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రామలింగారెడ్డి, గ్రామాల అధ్యక్షులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కోయిలకొండ, సెప్టెంబరు 20 : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోయిలకొండ పోలీసులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఇతర నెంబర్‌ల ద్వారా ఫోన్ చేసి ఆధార్ నెంబర్, ఓటీపీ అడిగితే చెప్పవద్దని సూచించారు. నేరాలపై అప్రమత్తంగా లేకపోతే మోసపోతారని తెలిపారు. పోలీసుల సూచనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఆనంద్, శ్రీనివాసులు, బాలరాజు, సుజాత పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి

హన్వాడ, సెప్టెంబరు 20 : గ్రామ పంచాయతీలలో నిధులు లేక పంచాయతీ కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే నిధులు విడుదల చేయాలని ఎంపీడీవోకు శుక్రవారం కార్యదర్శులు వినతి పత్రం ఇచ్చారు. స్థానిక ప్రజాప్రతినిదులు లేకపోవడంతో కార్యదర్శులే సొంత డబ్బులతో పనులు చేస్తున్నారని, కొందరికి జీతాలు కూడా రావడం లేదని కార్యదర్శులు లక్ష్మి, రాజాగౌడ్, శివకుమార్, వంశీకృష్ణ, శ్రీనివాసులు ఎంపీడీవోకు వివరించారు.

సమస్యలు పరిష్కరించాలి

మూసాపేట, సెప్టెంబరు 20 : గ్రామపంచాయతీ నిర్వహణ కోసం తాము ఖర్చు చేసిన బిల్లులు, పంచాయతీ సిబ్బంది వేతనాలు లేక పనులు చేయలేకపోతున్నామని, వెంటనే తగు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో కృష్ణయ్యకు పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. సెంట్రల్ కమిటీ ఫోరం పిలుపు మేరకు తాము సమస్యలపై వివరించామని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి కావాల్సిన వసతులు, మౌలిక సదుపాయాల కల్పన కోసం నిధులను కేటాయించి తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సురేస్, మహేందర్, సతీష్‌రెడ్డి, సంతోషి, మాధవి, రాఘవేందర్, కార్తీక్, అఖిల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పోషకాహారం అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

దేవరకద్ర, సెప్టెంబరు 20 : అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు పోషకాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, తహసీల్దార్ శ్రీనివాసులు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉపాధ్యాయులు తప్పకుండా మంచి పోషకాహారం అందించాలన్నారు. పిల్లలకు మంచి పోషక హరం అందిసై వారి ఎదుగుదలతో పాటు పిల్ల జ్ఞాపకశక్తి కూడా బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో శ్రీనివాస్‌రావు, అంగన్‌వాడీ సిబ్బంది, పాల్గొన్నారు.

రేపు లింగంపల్లిలో వైద్య శిబిరం

నవాబ్‌పేట, సెప్టెంబరు 20 : మండలంలోని లింగంపల్లి గ్రామంలో ఈనెల 22న ఉదయం 10 గంటలకు సాయి సేవా సమితి ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు కిషోర్‌బాబు మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఆసుపత్రుల నుంచి ప్రముఖ వైద్యులు ఈ వైద్య శిబిరంలో పాల్గొంటారని, లోకిరేవు, ఆర్సీపూర్, ఊరంచుతండా, కిషన్‌గూడ తదితర గ్రామాల ప్రజలు హాజరై వైద్యం చేయించుకోవాలని కోరారు.

విజయవంతమైన పశువైద్య శిబిరం

నవాబ్‌పేట, సెప్టెంబరు 20 : మండలంలోని కొల్లూర్ గ్రామంలో గురువారం పశు వైద్యాధికారి రవిచందర్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ రాంప్రసాద్ హాజరై సుమారు 50 పశువులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు నిర్వహించారు. అనంతరం సాధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువులకు ఏమైనా వ్యాధులు సోకితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, లంబ వెంకటయ్య, గోపాలమిత్ర తరుణ్, కృష్ణ, చెన్నయ్య పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌ను అందజేసిన ఆటో డ్రైవర్

జడ్చర్ల, సెప్టెంబరు 20 : ఆటోలో పడిపోయిన సెల్‌ఫోన్‌ను సంబంధిత యజమానికి అందచేసి ఓ ఆటో డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. జడ్చర్ల పట్టణానికి చెందిన అరవింద్ బోయ ఆటోలో కొత్తకోటకు చెందిన అనిల్ మహబూబ్‌నగర్ నుంచి జడ్చర్లకు ప్రయాణించాడు. ప్రయాణించిన సందర్భంలో ఆటోలో అనిల్‌కు చెందిన సెల్‌ఫోన్ పడిపోయింది. శుక్రవారం ఉదయం ఆటో శుభ్రం చేస్తుండగా సెల్‌ఫోన్ ఉండడాన్ని గమనించి, వెంటనే యూనియన్ అధ్యక్షుడు హాజీకి సమాచారం అందించారు. అనంతరం కొత్తకోటకు చెందిన అనిల్‌ను పిలిచి సుమారు రూ.8వేల విలువగల సెల్‌ఫోన్‌ను అప్పగించారు.

కురిసిన వర్షం

మిడ్జిల్, సెప్టెంబరు 20 : మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం సాయంత్రం మోస్తరు నుంచి భారీగా వర్షం కురిసింది. కొన్ని రోజులుగా వర్షాలు కురవకపోవడంతో పంటలు వాడుపడుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో ఈ వానలు పంటలకు ఉపయోగపడుతాని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.